కథానిక ◆ గంధం యాజ్ఞవల్క్య శర్మ

# మరణించినవాడు

**క్షణికోద్వేగాల నడుమ అనుబంధాల కోసం, ఆనందాల కోసం అల్లాడిపోయే మనిషికి, కొన్ని ఊహించని మలుపులు ఈ అనంత విశ్వంలో అతని ఉనికి ఏపాటిదో గుర్తుచేస్తుంటాయి**

"ఒక ఆశ్చర్యకరమైన వార్తను చెప్పేందుకు, బస్సు దిగి ఇంటికి వెళ్ళకుండా ఏకాయెకిన ఇక్కడకు వచ్చేశాను" అన్నాడు మంగేశ్వరరావు మా గుమ్మంలో అడుగుపెడుతూనే. అతని చేతిలో బ్రీఫ్‌కేస్ ఉంది.

మంగేశ్వరరావు గొంతు వింటూనే మా ఆవిడ వచ్చింది హాలులోకి.

ఆ వార్త 'ఆశ్చర్యకరమైనదే కాదు, ఆనందకరమైనది కూడా' అన్నట్లు మంగేశ్వరరావు మొహంలో ఆనందం, ఉత్సాహం పెల్లుబికి కనిపిస్తున్నాయి.

"ఏమిటీ ఆ వార్త" అని ప్రశ్నించాను.

"రెండు సంవత్సరాల కిందట పోయాడనుకొన్న మన రాజశేఖరం బతికే ఉన్నాడట."

నేనూ, మా ఆవిడ ఒక్కసారి "ఆఁ" అంటూ ఆశ్చర్యపోయాం. అది ఆనందమో, ఆశ్చర్యమో, దిగ్భ్రమో... ఏమో? ఆ వార్త కుదిపిన కుదుపు నుండి తేరుకోవడానికి చాలాసేపు పట్టింది మాకు.

"నిజమా" అన్నాను నమ్మలేనట్లు.

"నిజమా అన్న సంశయం నాలోనూ నుడులు తిరిగింది. కానీ, ఆ 'అబ్బాయి' చెప్పిన ఆ కబురును నమ్మకుండా ఉండడానికి వీలులేనన్ని నిదర్శనాలు దొరికాయి" అన్నాడు మంగేశ్వరరావు.

"ఆ అబ్బాయి ఎవరు?"

"వివరంగా చెబుతానుండండి" అంటూ తన చేతిలోని బ్రీఫ్‌కేస్‌ను కింద పెట్టి, నాకెదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు మంగేశ్వరరావు.

"అయ్యో, నా మతి మండా. మంచినీళ్ళైనా అడిగాను కాదు. మంచినీళ్ళు కావాలా అన్నయ్యగారూ" అంది మా ఆవిడ.

"ఆఁ... చల్లనివి ఫ్రిజ్‌లోనివి ఉంటే ఇవ్వమ్మా. ప్రయాణాన ఎండన వడి వచ్చానేమో, ఒకటే దాహం దారి పొడవునా" అన్నాడు మంగేశ్వరరావు.

మంచినీళ్ళు తాగి ప్రారంభించాడు.

"మొన్న, బుధవారం పొద్దున్నే మా తమ్ముడు శేషగిరి, 'పొన్నూరు నుండి వాడి కూతురిని చూసుకోవడానికి ఎవరో పెండ్లివారు వస్తున్నారు, రమ్మని ఫోన్ చేశాడు. వెంటనే బయలుదేరి వెళ్ళాను. ఆనాటి సాయంత్రం పిల్లవాడు, అతని తల్లితండ్రులు వచ్చారు. పిల్లవాడికి బ్యాంకు ఉద్యోగం. ప్రస్తుతం బాపట్ల బ్రాంచిలో పనిచేస్తున్నాడు. మాటల సందర్భంలో అతగాని ఫస్ట్ పోస్టింగ్ చిత్తూరు జిల్లాలో అన్నాడు. అక్కడ తాను ఒక్క సంవత్సరం మాత్రమే పనిచేశాడట."

ఏదో మాట్లాడాలిగా, "చిత్తూరు జిల్లాలో ఎక్కడ" అని అడిగాను.

"నెమళ్ళదిన్నె అని అదో శుద్ధ పల్లెటూరులెండి" అన్నాడు.

'నెమళ్ళదిన్నె' అని అనగానే మనసు ఝల్లుమన్నట్లనిపించింది.

"నెమళ్ళదిన్నెనా" అన్నాను, ఆ పేరు నాకు పరిచితమే అన్నట్లు.

"ఏం? అక్కడెవరన్నా మీకు తెలుసా" అని ప్రశ్నించాడాబ్బాయి.

"రాజశేఖరం అని మా మిత్రుడు, మాతోనే టీచరుగా పనిచేశాడు. అతనిది ఆ ఊరే" అన్నాను.

"ఓహో, ఆయనా" అన్నాడు.

నాకాశ్చర్యమేసింది. 'కిందటి సంవత్సరం మాత్రమే నెమళ్ళదిన్నెలో ఉన్న ఈ పెండ్లికొడుక్కి రెండు సంవత్సరాల కిందట పోయిన రాజశేఖరమెలా తెలుసా' అని.

"మా రాజశేఖరం పోయి రెండేళ్ళయింది."

"ఏమిటి... రాజశేఖరంగారు, రిటైర్డు టీచరు... వారి ఇంటి పేరు కూడ నెమళ్ళదిన్నెనే. ఆయన గురించేనా మీరు మాట్లాడుతోంది?" ప్రశ్నించాడా పెండ్లికొడుకు.

"అవును" అన్నాను నేను.

"ఎప్పుడు పోయాడంటారు?"

"రెండు సంవత్సరాల కిందట" అన్నాను.

"మీరేదో పొరబడుతున్నారు. నెమళ్ళదిన్నె రాజశేఖరంగారి ఇంటి కింది భాగంలోనే మా బ్యాంకు బ్రాంచి ఉంది. పై భాగంలో ఆయన ఉండేవారు. భార్య లేరు. ఒంటరివాడాయన. ఆయనగారికి మా బ్యాంకులో సేవింగ్స్ ఎకౌంటు కూడా ఉంది. నేనక్కడ ఉన్న సంవత్సరం పొడుగునా ఆయన్ను నేను చూస్తూనే ఉన్నాను. ఈ నాటికి సరిగ్గా మూడు నెలల కిందటే నేనక్కడ నుండి రిలీవ్ అయి వచ్చింది. ఆనాడు కూడా ఆయన కనిపించారు నాకు. 'మీ ప్రాంతాలకు వెళుతున్నారట కదా. బెస్ట్ ఆఫ్ లక్' అని కూడా నాకు వీడ్కోలు చెప్పారాయన" అన్నాడాబ్బాయి.

నేను అవాక్కయినట్లు మాట్లాడలేకపోయాను. అప్పటికీ అనుమానం తీరక, "నీవు చెప్పే రాజశేఖరం ఎలా ఉంటాడో చెప్పు" అన్నాను.

"బక్కపలచగా ఉంటారు. ఖద్దరు బట్టలే కడతారు. నొసటన చిన్నబిడ్డ చేష్టకు కాల్చిన మచ్చ. తలంతా తెల్లగా ముగ్గుబుట్టలా ఉంటుంది."

ఆ వర్ణన విన్న నాకు నా ముందు రాజశేఖరం ప్రత్యక్షమయినట్లే అనిపించింది. ఆ అబ్బాయి వర్ణించిన రూపురేఖలు ముమ్మూర్తులా రాజశేఖరానివే. అనుమానం లేదు.

నాకప్పుడు జ్ఞాపకానికొచ్చింది. కలకత్తా నుంచి రాజశేఖరం రాసిన చివరి జాబులో, వాళ్ళబ్బాయికి ఫారిన్ చాన్సు వచ్చిందని, రేపో మాపో వెళ్ళనున్నాడని, తాను తన స్వస్థలమైన నెమళ్ళదిన్నెకు వెళ్ళి అక్కడే తన సమీప బంధువుల మధ్య ఉంటూ శేష జీవితాన్ని గడుపుతానని రాశాడు. అలాగే అక్కడకు వెళ్ళి ఉన్నాడేమో! మనకు అతను పోయాడని వచ్చిన జాబు అబద్ధమేమో అనిపించింది.

అయినా సందేహం నన్ను వదలక, "రాజశేఖరం, తాను నరసరావుపేట మునిసిపల్ హైస్కూలులో లెక్కల మాస్టారుగా పనిచేశానని చెప్పాడా" అని ప్రశ్నించాను.

"ఆయనెక్కడ పనిచేసిందీ మా మధ్య ప్రస్తావనకు రాలేదు కానీ, ఆయన లెక్కల మేస్టారే అని చెప్పగలను. ఎందుకంటే, మా బ్యాంకు మేనేజరుగారమ్మాయికి ఆయన లెక్కలు ట్యూషన్ చెప్పేవారు. మరో విషయం, ఆయన ఆ ట్యూషన్ ఉచితంగా చెప్పేవారు. ఆయనకు ఉచితంగా ట్యూషన్ చెప్పడం అలవాటట" అన్నాడు.

"మన రాజశేఖరం ఇక్కడా అంతేగా. తన దగ్గరకు వచ్చిన విద్యార్థులకు ఉచితంగా లెక్కలు ట్యూషన్ చెప్పేవాడుగా" అన్నాడు మంగేశ్వరరావు.


ఈ వార్త మా మధ్య గొప్ప సంచలనాన్ని రేపింది. మా మధ్య నుండి ఎన్నో ప్రశ్నలు అడ్డదిడ్డంగా బయటకొచ్చాయి.

రాజశేఖరం బతికి ఉన్నాడని నమ్మకుండా ఉండడానికి మాకు ఎలాంటి కారణాలూ కనిపించలేదు. మరి అదే నిజమైతే గత రెండు సంవత్సరాలుగా ఆప్త మిత్రులమైన మాకు తన యోగక్షేమాలు తెలుపుతూ రాజశేఖరం జాబులు ఎందుకు రాయలేదు?

"ఈ చెప్పిన అబ్బాయి తమాషాగా మాట్లాడలేదు కదా" అన్నాను. కానీ నాకే, 'తమాషాగా మాట్లాడడానికి అతనికేం పని' అనిపించింది.

"ఆ అబ్బాయి అలా జులాయిలా మాట్లాడేవాడిలా కనిపించలేదు. పైగా ఆపాటికే పెండ్లి చూపులు అయిపోవడం, పిల్ల, పిల్లవాడు ఒకరికొకరు నచ్చడం జరిగిపోయాయి. పెండ్లి కూడా ఖాయపరచుకొన్నాం. ఆ అబ్బాయికేవో ఆదర్శాలున్నాయట. కట్నం తీసుకోనన్నాడు" అని అన్నాడు మంగేశ్వరరావు.

మంగేశ్వరరావు మాటలు విన్నాక ఆ అబ్బాయి మీది అనుమానాలు తొలగిపోయాయి. అప్పుడు మా ఆవిడ గతాన్ని తిరగదోడుతూ ఒక ప్రశ్న వేసింది.



"అసలు రాజశేఖరం అన్నయ్యగారు పోయినట్లు వచ్చిన వార్త ఎక్కడి నుండి, ఎలా వచ్చింది" అని.

"జ్ఞాపకం తెచ్చుకొన్నాను. ఆ వార్త ఒక కార్డు ద్వారా నాకే వచ్చింది రెండు సంవత్సరాల కిందట. నెమళ్ళదిన్నె పోస్టు ముద్రతోనే వాళ్ళబ్బాయి భాస్కరం పేరిట ఆ చావు కబురు కార్డు నా చిరునామాకే పోస్టు చేయబడింది. పోస్టు చేయబడిన నెల రోజులకు అందిందది నాకు. ఎవరిదో ఆ చేతిరాత, చదవడానికి చాలా క్లిష్టంగా ఉంది. చిరునామాలో పిన్‌కోడ్‌గాని, జిల్లా పేరుగానీ లేదు. దానిమీది ముద్రలు, ఎండార్సుమెంటు చూస్తే తెలిసింది- మొదటది నర్సంపేటకు, తరువాత నర్సీపట్టణానికి, తదుపరి నర్సాపూర్‌కు వెళ్ళి, చివరిసారిగా నరసరావుపేటకు వచ్చిందని.

అందులోని సారాంశం, 'రాజశేఖరం చనిపోయాడని, కర్మాంతరాలు ఆయన స్వస్థలమైన నెమళ్ళదిన్నెలో జరుగుతాయని.

ఈ కార్డును చూసి నేను, మంగేశ్వరరావు ఎంతో చింతించాం. రాజశేఖరం పోయినందుకే కాదు, 'సకాలంలో ఆ జాబు మాకు అందివున్నట్లయితే, కనీసం అతడి కర్మాంతరాలకైనా నెమళ్ళదిన్నె వెళ్ళివుండేవాళ్ళం కదా' అని కూడా.

ఆ కార్డును హైస్కూలు హెడ్‌మాస్టారికి చూపి స్కూలుకా పూట సెలవు ఇప్పించి, ఉపాధ్యాయ సంఘం తరపున ఒక సభ జరిపించి, సంతాప తీర్మానం చేయించాం. ఆ తీర్మాన పాఠాన్ని వాళ్ళబ్బాయి భాస్కరానికి, ఆపాటికి అతడెలాగూ కలకత్తా తిరిగి వెళ్ళి ఉంటాడని భావించి అక్కడికే టెలిగ్రాం ద్వారా పంపాం.

మూడు రోజులకు ఆ టెలిగ్రాం తిరిగి వచ్చింది. భాస్కరం అక్కడ లేడట. ఫారిన్ వెళ్ళాడట.

*   *   *

రాజశేఖరం, మంగేశ్వరరావు, నేనూ చాలా స్నేహంగా మెలిగేవాళ్ళం. ఒక నాటిదా మా స్నేహం. ముప్ఫయ్ అయిదు సంవత్సరాలు ఆత్మీయంగా పెనవేసుకొన్న స్నేహబంధం మాది.

ఎక్కడో చిత్తూరు జిల్లాలో, మారుమూలనున్న గ్రామం నెమళ్ళదిన్నె. అక్కడ పుట్టిపెరిగి, బి.ఏ బి.ఇడి అయి ఉద్యోగాన్వేషణలో నరసరావుపేట మునిసిపాలిటీవారి ఉద్యోగ ప్రకటన చూసి, కడుపున ఇంత విద్య ఉండాలే కాని, అదివున్నవాడికి ఏ దేశమైనా, ఏ ప్రాంతమైనా ఒకటే అని వచ్చి, ఇంటర్వ్యూలో నెగ్గి, హైస్కూల్‌లో లెక్కల మాస్టారుగా చేరిపోయాడు రాజశేఖరం.

అదే ఇంటర్వ్యూలో నేను తెలుగు పండిట్‌గా, మంగేశ్వరరావు సోషల్ అసిస్టెంట్‌గా సెలక్టయ్యాం. ముగ్గురం ఒకేనాడు ఉద్యోగంలో చేరాం. ఆ నాటి నుండి రిటైరయ్యే నాటివరకు మేం ముగ్గురం ఎంతో ఆత్మీయంగా కష్టసుఖాలు పంచుకొంటూ ఒకరికొకరు చేదోడు వాదోడుగా మెలిగాం.

రిటైరవుతూనే రాజశేఖరం కలకత్తాలో ఇంజనీరుగా పనిచేస్తున్న కొడుకు భాస్కరం దగ్గరకు వెళతానని వెళ్ళాడు. అప్పటికి అతని భార్య పోయి పది హేనేళ్ళయింది. నేనూ, మంగేశ్వరరావు రిటైరయి నరసరావుపేటలోనే ఉండిపోయాం. ఆ తరువాత సంవత్సరం తిరక్క ముందే రాజశేఖరం పోయినట్లు వార్త వచ్చింది. ఆ తరువాత తరచూ రాజశేఖరం మా స్మృతిపథంలో మెలిగేవాడు. అతన్ని చుట్టివున్న ఎన్నో సంఘటనలను నెమరువేసుకొనేవాళ్ళం.

> రాజశేఖరం, మంగేశ్వరరావు, నేనూ చాలా స్నేహంగా మెలిగేవాళ్ళం. ఒకనాటిదా మా స్నేహం. ముప్ఫయ్ అయిదు సంవత్సరాలు ఆత్మీయంగా పెనవేసుకొన్న స్నేహబంధం మాది.



చిత్రాలు: నర్సిం

రాజశేఖరం ఎంతటి పరోపకారి.

మంగేశ్వరరావుకోసారి పెద్ద జబ్బు చేసి హాస్పిటల్‌లో నెల రోజులుండాల్సి వచ్చింది. అతని భార్యకు ప్రసవ సమయం. పుట్టింటికెళ్ళింది. ఆ నెల రోజులూ సెలవు పెట్టి అన్నీ మంచానే అయిన మంగేశ్వరరావుకు విసుగు, విరామం లేకుండా, అసహ్యమని అనుకోకుండా సపర్యలు చేశాడు. అలాగే మా చిన్నమ్మాయి పెండ్లి పది రోజులుందనగా నేను అస్వస్థుణ్ణి అయ్యాను. ఆ కార్యభారం అంతా నెత్తిన వేసుకొని, అంతా తానే అయి, ఆ శుభకార్యాన్ని గట్టెక్కించాడు రాజశేఖరం. అతని ప్రమేయం లేకుండా మా ఇళ్ళలో ఏ ఒక్క కార్యక్రమం జరిగేది కాదు.

ఒక్క మా ఇళ్ళలోనే కాదు, అటు హైస్కూలులోను అంతే. స్కూలు అడ్మిషన్‌లు మొదలుకొని టెర్మినల్ పరీక్షలు, డి.ఇ.ఓ ఇన్‌స్పెక్షన్స్, స్కూలు వార్షికోత్సవాలు- ఒకటేమిటి అన్నింటా రాజశేఖరం లేనిదే హెడ్‌మాస్టరుకు క్షణం గడిచేది కాదు.

రాజశేఖరం ఒక పరోపకార పారీణుడు, ఆప్తజన బాంధవుడు.

*   *   *

పొన్నూరు నుండి మంగేశ్వరరావు తెచ్చిన ఈ వర్తమానంతో రాజశేఖరం బతికే ఉన్నాడనే నిశ్చయానికి వచ్చేశాము మేము. ఆనాటి ఆ కార్డు తెచ్చిన చావు కబురును విస్మరించాము.

రాజశేఖరం బతికే ఉన్నాడన్న వార్త మంగేశ్వరరావును ఉక్కిరిబిక్కిరి చేసి ఉద్వేగపరిస్తే, అదే వార్త నన్ను ఆలోచనలో పడవేసింది, 'రాజశేఖరం ఈ రెండు సంవత్సరాలుగా మాకెందుకు జాబు రాయలేదు' అని.

రాజశేఖరం కలకత్తా నుండి చివరిసారిగా మాకు రాసిన జాబుకు మా నుండి జవాబు వెళ్ళలేదు. జవాబు రాద్దామనుకొంటూనే కొంత తాత్సారం జరిగింది. ఆ జాబులో రేపో మాపో వాళ్ళబ్బాయి భాస్కరం ఫారిన్ వెళతాడని, తాను నెమళ్ళదిన్నె వెళతానని రాయడంతో, పోనీ తాను నెమళ్ళదిన్నె చేరాకే రాయవచ్చులే అని కూడా అనుకొన్నాంలా ఉంది.

ఎంతటి లావణ్యరాశికైనా ఎక్కడో రవ్వంత వంపు ఉన్నట్లు, సకల సద్గుణ సంపన్నునికి సైతం కించిత్ వ్యసనరేఖ ఉన్నట్లు, రాజశేఖరానికి ఒక్కోసారి మాట పట్టింపు వస్తే పట్టించుకొనే చిన్నపాటి అసహనపు తత్త్వముంది. బహుశా రాజశేఖరం మా జాబు కోసం ఎదురు చూసి, అది రానందుకు కినిసి, తాను జాబు రాయడం మానేశాడా!


నా ఆలోచన మరో పుంతనా ప్రయాణించింది.

తనకు భార్య లేదు. ఒక్క పిల్లవాడు తన్నొదిలి విదేశాలు పట్టిపోతున్నాడు. అతనికి మిగిలింది ముప్ఫయ్ అయిదేళ్ళ సోదరవాత్సల్యంతో మెలగిన మేము. అలాంటి మేము తనను, 'వచ్చి మా మధ్యే నరసరావుపేటలో ఉండి శేషజీవితాన్ని గడుపు. మా పిల్లల అండదండలు, మాకున్నట్లే నీకూ ఉంటాయి' అని అననందుకు రాజశేఖరం 'డిజపాయింట్ అయ్యాడా? అందుకే మౌనంగా ఉండిపోయాడా' అనిపించింది.

నా ఆలోచన విని మంగేశ్వరరావు, "అవును, మనిద్దరం కృతఘ్నులం. క్షమించరాని నేరం చేశాం" అన్నాడు.

"జరిగిందేదో జరిగిపోయింది. గత జల సేతు బంధనం వద్దు. రాజశేఖరానికి క్షమాపణలు చెప్పుకొంటూ ఒక ఉత్తరం రాసి తనను ఇక్కడకు వచ్చేయమందాం" అన్నాను.

"నాకు ఈ ఉత్తరాల మీద నమ్మకం లేదు. అవి చేరవు. చేరినా ఏ నెలకో, రెండు నెలలకో. కిందటి సారి ఆ కార్డు మనకు సకాలంలో చేరి ఉంటే మనం నెమళ్ళదిన్నె వెళ్ళి ఉండేవాళ్ళం. అది అబద్ధపు వార్త



**మంగేశ్వరరావు పెద్దబ్బాయి పెదవాయికి వెంటనే బయలుదేరతానంటున్నాడు. మళ్ళీ ఫోను వచ్చింది. పెదవాయి నుండే. "సార్! మంగేశ్వరరావుగారు పోయారు" అన్నాడా రాజశేఖరం.**

అని అనాడే తెలుసుకొని ఉండేవాళ్ళం కదా" అన్నాడు మంగేశ్వరరావు.

"మరేం చేద్దామంటావు" అన్నాను.

"నేను వెంటనే నెమళ్ళదిన్నె వెళ్ళి రాజశేఖరానికి ముఖతా క్షమాపణలు చెప్పుకొని, అతడితో సహా తిరిగి వస్తాను" అన్నాడు.

"అయితే, నేనూ వస్తాను" అన్నాను.

"నీవూ వస్తావా! వద్దు. అసలే రోహిణి కార్తె. ఎండలు మండిపోతున్నాయి.

"ఫరవాలేదు. ఏదో ఇంత చల్లని వేళ చూసుకొని ప్రయాణం చేద్దాం" అన్నాను.

ససేమిరా కాదన్నాడు మంగేశ్వరరావు.

నాకు మూడు నెలల క్రిందట 'మైల్డ్‌'గా 'స్ట్రోక్‌' వచ్చింది. పది రోజులు హాస్పిటల్‌లో ఉన్నాను. డాక్టర్లు 'శ్రమించే పనేదీ' చేయరాదని ఆంక్షలు పెట్టి మందులిచ్చి ఇంటికి పంపించారు. మంగేశ్వరరావు నెమళ్ళదిన్నెకు ఆ మరునాడు బయలు దేరేట్లు ప్రయాణం ఖరారు చేశాం.

"రాజశేఖరానికి, మన తప్పు లేమన్నా ఉంటే మన్నించి మరచి పొమ్మని చెప్పు. తప్పక నరసరావుపేట రమ్మని నేనూ కోరానని చెప్పు. రాజశేఖరానికి మెత్తటి మనసు. నా ఆరోగ్య స్థితి వింటే తప్పక రెక్కలు కట్టుకొని వచ్చి వాలతాడు" అన్నాను.

మరునాటి సాయంత్రం బస్టాండుకు వెళ్ళబోతూ వచ్చాడు మంగేశ్వరరావు.

"తిరుగు ప్రయాణంలో తిరుపతిలో దిగి ఆ వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకొని, రాజశేఖరం మనకు దక్కినందుకు కృతజ్ఞతలు చెప్పుకుంటాను" అన్నాడు.

మంగేశ్వరరావుకు గుళ్ళు, గోపురాలంటే గిట్టవు. నిరీశ్వరవాది. "ఆ మంగేశ్వరరావేనా ఇలా అంటున్నది" అని ఆశ్చర్యపోయాను.

"సంతోషం. అలాగే రాజశేఖరాన్ని కలవగానే, నాకో ఫోను కొట్టి రాజశేఖరం చేత మాట్లాడించు. అతని గొంతు వినాలని నాకు తహతహగా ఉంది" అన్నాను.

"అదేమరి తినబోతూ రుచి చూడడం అంటే. ఎలాగూ మేమిద్దరం వస్తాం గదా! సరే, పోనీ అలాగే ఫోను చేయిస్తాను" అంటూ బయలుదేరి వెళ్ళాడు మంగేశ్వరరావు.

మంగేశ్వరరావు వెళ్ళిన దగ్గరనుంచి నా మదంతా మంగేశ్వరరావు, రాజశేఖరాలే నిండిపోయారు. ఈపాటికి మంగేశ్వరరావు చిత్తూరు చేరి ఉంటాడు. మళ్ళీ ఉదయాన్నే 'నగరం' బస్సెక్కి ఉంటాడు. చిత్తూరుకు నగరం యాభై కిలోమీటర్లు. అక్కడ 'కోనేటి కొండ' వెళ్ళే డొంక బస్సు దొరికి ఉంటుందతనికి. అది ఆ మట్టి రోడ్ల మీది దుమ్మంతా రేపుకుంటూ, మూడు గంటలు ప్రయాణం చేసి, 'కోనేటి కొండ' మలుపున, మంగేశ్వరరావును దింపి ఉంటుంది. అదిగో, ఆ మలుపుకు కూతవేటు దూరంలో నెమళ్ళదిన్నె. ఆ కాస్త నడిచి వెళ్ళాలి. వెళ్ళే ఉంటాడు. రాజశేఖరం ఇంటిలోనే బ్యాంకు అన్నారుగా. తెలిగ్గానే ఆ ఇంటిని కనుక్కొని ఉంటాడు మంగేశ్వరరావు. ఇలా సాగాయి నా ఆలోచనలు ఆ రెండు రోజులు క్షణక్షణానికి.

ఆ రెండవ నాటి సాయంత్రం, నెమళ్ళదిన్నె ఫోను కోసం ఎదురు చూస్తూ, ఫోనున్న బల్లపక్కనే పడక కుర్చీలో కూర్చొని, అలాగే మాగన్నుగా కనులు మూశానేమో. చిన్న కునుకు పట్టిందిలా ఉంది. నా ముందో అద్భుత దృశ్యం ప్రత్యక్షమయింది.

నీలలోహిత కాంతులతో నిండిన ఆకాశం! అందులో ఒక పుష్పక విమానం. దానిలో రాజశేఖరం, మంగేశ్వరరావు.

"ఇన్నేళ్ళ వియోగానంతరం చూశాడేమో మంగేశ్వరరావును రాజశేఖరం గాఢంగా కౌగలించుకొని, 'వచ్చావా. రా' అంటూ తనతో ఎక్కడికో తీసికొని పోతున్నాడు.

రాజశేఖరం మూర్తిని చూసిన సంభ్రమంతో, "రాజశేఖరం" అంటూ పెద్దగానే కేక పెట్టాను నేను. నా కేకను వాళ్ళు వినిపించుకోలేదు. మళ్ళీ మళ్ళీ నేనలా పిలుస్తూ కేకలు పెడుతూనే ఉన్నాను.

నా కేకలు విని వంట ఇంటిలో నుంచి వచ్చిన మా ఆవిడ, నన్ను తట్టిలేపుతూ, 'ఏమిటీ, అసుర సంధ్య వేళ ఈ నిద్రేమిటి? ఈ కలవరింతలేమిటి" అంది.

మెలకువ వచ్చింది.

అంతలోనే ఫోను రింగయింది. ఫోనెత్తాను.

"ఈజిట్ 24651, నరసరావుపేట?"

"యస్" అన్నాను.

"లోకనాథం మాస్టారిల్లేనా." ఎవరిదో కొత్త గొంతుక. పోల్చుకోలేక పోయాను. "అవును. మాట్లాడుతోంది లోకనాథం మాస్టారినే" అన్నాను.

"నేను చిత్తూరు జిల్లా "పెదవాయి" నుంచి మాట్లాడుతున్నాను. ఈ రోజు మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతాన మంగేశ్వరరావు గారట, రిటైర్డు టీచర్ని అన్నారు. మా నెమళ్ళదిన్నె వచ్చారు. వస్తూనే నరసరావుపేటలో పనిచేసిన 'రాజశేఖరం' కోసం వాకబు చేశారు. అలా వాకబు చేస్తూనే, మంచి ఎండన పడి వచ్చారేమో, వడదెబ్బ తగిలిందిలా ఉంది. తల తిరిగి పడిపోయారు. ఆయన్ను వెంటనే, నెమళ్ళదిన్నెకు దగ్గర్లో ఉన్న మండల హెడ్‌క్వార్టర్సు "పెదవాయి"కి తీసుకొని వచ్చి హాస్పిటల్లో చేర్పించాము. ఆయనగారి 'బ్రీఫ్‌'లో ఉన్న మీ చిరునామా, ఫోను నంబరును బట్టి ఫోను చేస్తున్నాను" అన్నాడాయన.

ఆ ఫోను వార్త నన్ను చెల్లాచెదరు చేసింది. క్షణకాలం తరువాత చిన్నగా, తేరుకొని, 'అయ్యా తమరెవరు' అన్నాను.

"నా పేరు, రాజశేఖరం" అన్నాడు.

"రాజశేఖరమా?"

"క్షమించండి. నా పేరూ నెమళ్ళదిన్నె రాజశేఖరమే. మీ నరసరావుపేటలో పనిచేసిన రాజశేఖరం, మా పెద్దనాన్న గారబ్బాయి. మా తాతగారి పేరు మాకిద్దరికీ పెట్టారు. నా కంటే ఆరు నెలలు తానే పెద్ద. మేమిద్దరం ముమ్మూర్తులా ఒకే పోలిక. కాకుంటే నేను కొంచెం పొట్టి, నలుపు కూడానేమో! ఇద్దరం బి.ఇడి టీచర్లమే. నేను ఈ జిల్లాలో పనిచేశాను. రెండేళ్ళ కిందట మా అన్నయ్య రాజశేఖరం శాశ్వతంగా మా నెమళ్ళదిన్నెలో ఉండిపోవడానికి కలకత్తా నుంచి వచ్చారు. వచ్చిన వారం రోజులలోనే అకస్మాత్తుగా చనిపోయారు!"

క్షణం కళ్ళు మూసుకొన్నాను. "అయితే, ఉన్నాడనుకొన్న మా రాజశేఖరం లేడన్నమాట!"

"మంగేశ్వరరావుకు ఎలా ఉంది?" ప్రశ్నించాను.

సెలైన్ పెట్టారు. డాక్టరు పక్కనే ఉండి చూస్తున్నారు. పరిస్థితి కొంచెం కొంచెంగా మెరుగవుతోంది. రేపు ఉదయాన మళ్ళీ ఫోను చేస్తాను. ఫోను పెట్టేశారాయన.

మంగేశ్వరరావు ఇంటికి కబురు చేశాను. వాళ్ళ పెద్దబ్బాయి మా ఇంటికొచ్చాడు. తాను పెదవాయికి వెంటనే బయలుదేరతానంటున్నాడు. మళ్ళీ ఫోను వచ్చింది. పెదవాయి నుండే. "సార్! మంగేశ్వరరావుగారు పోయారు" అన్నాడా రాజశేఖరం. ■